ఇండస్ట్రీస్‌లో గత మూడు సంవత్సరాలుగా వర్కర్‌గా పని చేసినట్టు, మీరు సరిగా జీతాలు ఇవ్వకుండా ఉద్యోగం నుంచి సడన్‌గా తొలగించినట్టు తెలియజేశారు. మూడు సంవత్సరాలుగా మీ దగ్గర పని చేస్తూ వుంటే ఉద్యోగం ఎందుకు పెర్మనెంట్ చెయ్యలేదో తెలియచేస్తూ, వెంటనే అతన్ని ఉద్యోగంలోకి తీసుకొని, అతని ఉద్యోగం పెర్మనెంట్ చేసి అతనికి రావలసిన జీతం బాకీ మొత్తం వెంటనే చెల్లించక పోతే చట్టరీత్యా మీపై తగుచర్య తీసుకోవలసివస్తుందని హెచ్చరిస్తున్నాను.

దీని కాపీ ఫాక్టరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయమునకు పంపడమైనది.

ఇట్లు

10-8-82. జిత్తు జలగారావు

విశాఖపట్నం అడ్వకేటు

—భమిడిపాటి అనంతనారాయణ

---

## వా! భూమి గుండ్రమే!

అదో పంపు. దానిచుట్టూ ఓ ఐదుబిందెలు.

పంపుదగ్గర బిందెలు నిశ్శబ్దంగా ఉండడం సాధ్యమయ్యే పనేనా? ఐదు బిందెలూ మాట్లాడుకుంటున్నాయి. కొంచెం బిగ్గరగానే మాట్లాడుకుంటున్నాయి. అప్పుడప్పుడు మాత్రం గబుక్కున ముందుకి వంగి చాలా నిదానంగా, అతి నెమ్మదిగా మాట్లాడుకుంటూ, మళ్ళా యధాస్థానంలోకి వచ్చి, మళ్ళీ తమ మామూలు స్థాయిలో మాట్లాడుకుంటున్నాయి. అది అలా రొటీన్‌గా, వాటి జీవితాలతోపాటు సాగిపోతూ వుంటుంది.

ఆ రోజు, మామూలుగా తెల్లార్లేదు. మామూలుగా తెల్లారితే, యింతగా చెప్పుకోడానికేముంది? సూర్యుడు పడమట ఏమన్నా ఉదయించాడేమోనని ఊళ్ళోవాళ్ళకి అనుమానం వచ్చింది. కొంచెం ఆలస్యంగా లేచిన వాళ్ళు మాత్రం సూర్యుడి గురించి ఖచ్చితంగా అడిగారు. నా ఫ్రెండ్ మూర్తిగాడు 7 గంటల వార్తలు వినడానికి గబగబా లేచి వెళ్ళిపోయాడు. ఏమన్నా అమెరికా, రష్యాలు గాఢస్నేహితు లయిపోయారేమోనని వార్త వస్తుందేమోనని. అలా అందరం రకరకాలుగా ఊహాగానాలు చేసుకుంటూనే వున్నాము. ఇంతకీ అసలు విషయం ఏమిటంటే, ఆ రోజు ఐదు బిందెలూ నిశ్శబ్దంగా వున్నాయి.

మామూలు నిశ్శబ్దం కాదు. భయంకర నిశ్శబ్దం.

టప్‌టప్ మంటూ నీళ్ళ శబ్దం మాత్రం భయంకరంగా విన్పిస్తోంది. నా కూడా ఏమిటో అర్థం కాలేదు.

అంత సఖ్యంగా, అంత యూనిటీగా, ఊళ్ళో అందర్నీ భయపెట్టేవాళ్ళు యిలా కోపంగా, అంత మూగగా ఉన్నారంటే, నాకే కాదు, ఏమీ పట్టించుకోని మా తాత కూడా అర్థం కాలేదు.

ఇంతలో మా ఆఖరి చెల్లి పరుగెత్తుకుంటూ వచ్చింది. లైవ్ కాని ప్రత్యక్ష వ్యాఖ్యానం వినిపించింది.

* * *

"అబ్బాయంటే రాజశేఖరంలా వుండాలి" అన్నిటిలోకి చిన్న బిందె వ్యాఖ్యానం.

"రాజశేఖరమంటే ఎవరే?" అంటూ కొంచెం వయసు మళ్ళిన బిందె ప్రశ్న.




"'రాజశేఖరం' అంటే తెలీదూ?" చిన్న బిందె విడ్డూరం.

"ఇదెక్కడి చోద్యమమ్మా? రాముడిలా ఉండాలి అను, లేకపోతే కృష్ణపరమాత్మలా ఉండాలి, అను. అలా అంటే తెలుస్తుంది గానీ, యిలా రాజశేఖరం అంటే ఎలా తెలుస్తుందీ?".... యింకో పెద్ద బిందె విసుగు.

"రాజశేఖరం అంటే తెలీదా? సులోచన గారి నవల్లో హీరో!

ఆరడుగుల పొడవూ ........" వర్ణనతో పాటు ఓ ఆశ్చర్యం.

అలా, అలా మాటా మాటా పెరిగి, అది యుద్ధమై, డైలాగ్ కమ్ యాక్షన్ నుంచి మూకీలోకి వచ్చింది.

అదీ సంగతి.

ఓ వారం రోజులపాటు అలా ఆ మూకీ ఏ అడ్డంకులూ లేకుండా సాగింది. వాళ్ళ సంగతి ఎలా ఉన్నా, ఊళ్ళోవాళ్ళకి మాత్రం చాలా హాయి అనిపించసాగింది.

కానీ అంతలోనే మళ్ళీ ఓ ఘోరం జరిగిపోయింది.

ఓ రోజు పంపు దగ్గర. ప్రొద్దున్నే.

మళ్ళా ఐదు బిందెలూ చాలా సంఖ్యగా, మామూలు రీతిలో మాట్లాడుకుంటున్నాయి.

దానికా్కరణం, మామూలు విషయమా? అబ్బే, చాలా పెద్ద విషయం.

వాళ్ళ శత్రువైన కామాక్షమ్మగారి అమ్మాయి పెళ్ళి కుదిరింది. పెళ్ళి కొడుకు, అదిగో వాళ్ళు పోట్లాడుకున్నారే, అలాటి హీరో లక్షణాలు అంతో, కొంతో వున్నవాడు.

"కట్నం ఎంతో సరిగ్గా తెలిసిందా?" పెద్ద బిందె ఎంక్వయిరీ. "ఆ(, ఆ పిల్లాడికి ఏదో వుండి వుంటుంది. లేకపోతే ఈ కామాక్షమ్మ కూతుర్నే చేసుకోడానికి వస్తాడా?—"యింకో పెద్ద బిందె ఉక్రోషం. అదిగో, అలా మళ్ళా కథ మొదలు.

—పి. హేమలత